www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 16 మే 2023

వాహనం ద్వారా రేషన్ సరఫరా

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎట్టకేలకు ముదినేపల్లి, అన్నవరం గ్రామస్తులకు వాహనం ద్వారా సోమవారం రేషన్ సరఫరా కార్యక్రమం చేపట్టారు. రేషన్ సరఫరా చేసే వాహనం మరమ్మతులకు గురికావడంతో రెండు వారాలుగా ఎండియు ఆపరేటర్ రేషన్ స్టాక్ పాయింట్ వద్ద బియ్యం ఇస్తున్నాడు. ఇంటింటికీ వాహనం ద్వారా రేషన్ సరఫరా చేయకపోవడంతో ప్రజలు దూరం వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో కార్డుదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. దీనిపై 'మొరాయించిన రేషన్ సరఫరా వాహనం' బియ్యం కోసం ప్రజలు అవస్థలు అనే శీర్షికన ప్రజాశక్తిలో వార్త ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై స్పందించిన సిఎస్ డిటి చంద్రశేఖర్ మరమ్మతులకు గురైన వాహనం స్థానంలో వేరే వాహనం ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇంటింటికీ రేషన్ పంపిణీ జరిగేలా చర్యలు తీసుకున్నారు.



- ఠారెత్తిస్తున్న ఎండలు
- జిల్లాలో 43 డిగ్రీలుపైనే ఉష్ణోగ్రతల నమోదు
- వేడి గాలులతో జనం హడల్
- రోడ్లపైకి రావాలంటేనే భయంభయం
- ఉపాధి కూలీలు, చిరు వ్యాపారుల పరిస్థితి దయనీయం
- కరెంటు కోతలతో వృద్ధులు, పిల్లలు విలవిల

'మండే' సూర్యుడు

ఎండల తీవ్రతకు జనం హడలిపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో సోమవారం (మండే) సూర్యుడు నిప్పులు కురిపించాడు. వేడిగాలులకు జనం రోడ్లపైకి రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. రెండు జిల్లాల్లోనూ 43 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకు ఇలా అన్ని పట్టణాల్లో ఎండ తీవ్రతకు జనం బెంబేలెత్తిపోయారు. కొద్దిరోజుల క్రితం వరకూ అకాల వర్షాలతో ఆకాశం మేఘావృతమై ఉండటంతో ఎండతీవ్రత పెద్దగా లేదు. రెండు, మూడు రోజులుగా ఎండల తీవ్రత తారాస్థాయికి చేరింది. ఉదయం ఏడు గంటల నుంచే ఎండ తీవ్రత ప్రభావం ప్రారంభమవుతోంది. దీంతో బయటికి వెళ్లాలంటేనే జనం భయపడే పరిస్థితి ఏర్పడింది. ఎండల తీవ్రతకు ముఖ్యంగా ఉపాధి కూలీలు, రోడ్లపై చిరువ్యాపారుల పరిస్థితి దారుణంగా మారింది. ఉపాధి పని రెండు పూటలు పెట్టడంతో కూలీలు ఎండ తీవ్రతకు అనారోగ్యం పాలవుతున్నారు. కూలీలు ఉదయం ఆరు గంటల నుంచి 12 గంటల వరకూ ఎండలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉపాధి పనిచేసే చోట పూర్తిస్థాయిలో తాగునీరు, మజ్జిగ, టెంట్లు, మెడికల్ కిట్లు ఏ ఒక్కటీ సక్రమంగా లేని పరిస్థితి కొనసాగుతోంది. దీంతో కూలీలు ఎండ బారిన పడి కుప్పకూలుతున్నారు. రెండు పూటలా పని కొనసాగిస్తే ముందుముందు ఉపాధి కూలీలు మరింత దారుణ పరిస్థితులు ఎదుర్కోనున్నారు. ఉపాధి కూలీల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్లపై సైకిళ్ల, తోపుడు బండ్లపై పండ్లు, ఇతర వస్తువులు విక్రయించే చిరువ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది. ఒకవైపు తారురోడ్డు వేడి, మరోవైపు ఎండతీవ్రతతో చిరువ్యాపారులు వడదెబ్బకు గురవుతున్నారు. వ్యాపారం సాగితే తప్ప రోజు గడవని పరిస్థితి ఒకవైపు, ఎండల తీవ్రత మరోవైపు ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఇంకా ధాన్యం విక్రయాలు పూర్తికాకపోవడంతో పొలాల్లో ధాన్యం ఆరబెట్టేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

కరెంటు కోతలతో జనం విలవిల

గ్రామాల్లో విచ్చలవిడిగా కరెంటు కోతలు విధిస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో ఎండ తీవ్రతకు తాళలేక జనం అల్లాడిపోతున్నారు. మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో గంటల తరబడి విధిస్తున్న కరెంటు కోతలతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు వేడికి తాళలేక నానాయాతన పడుతున్నారు. ఫ్యాను ఆగితే ఉక్కపోతతో విలవిల్లాడుతున్నారు. గ్రామాల్లో జనం కరెంటు కోతలతో నరకం అనుభవిస్తున్నారు. డెల్టాలో ఆక్వా చెరువులకు కరెంటు సరఫరా చేస్తూ గృహ అవసరాలకు కోతలు పెడుతున్నారంటూ జనం నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇన్వర్టర్లు కొనుగోలు చేసుకోలేని పేదలు కరెంటు కోతలతో ఇళ్లలో ఉండలేక చెట్ల కిందకు చేరి ఉపశమనం పొందాల్సిన పరిస్థితి నెలకొంది. ఎండ వేడిమి తాళలేక మధ్యతరగతి ప్రజానీకం అప్పు చేసి ఎసిలు కొనుగోలు చేస్తున్నారు. వడగాల్పులపై ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో అధికారులు సూచనలిస్తున్నప్పటికీ అందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదనే చర్చ సాగుతోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో మజ్జిగ, తాగునీరు చలివేంద్రాలు పెద్దఎత్తున ఏర్పాటు చేస్తే ప్రజలకు మేలు జరిగే అవకాశం ఉంది. దాతలు ఏర్పాటు చేసిన చలివేంద్రాలు కొన్ని ఉన్నప్పటికీ ప్రభుత్వ ఆధ్వర్యంలో మరిన్ని ఏర్పాటు చేసి కొనసాగించాలని అంతా కోరుతున్నారు. ఉష్ణోగ్రతలు మున్ముందు మరింత పెరిగే పరిస్థితి ఉందని వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. దీంతో అందుకు తగినట్లుగా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోకపోతే సామాన్య ప్రజానీకం వడదెబ్బతో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడనుంది.

ఎంఎల్‌సిలుగా కవురు, వంక ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - పాలకొల్లు, తణుకు రూరల్

ఎంఎల్‌సిలుగా జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్ వెలగపూడిలోని శాసనమండలి కార్యాలయంలో సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. వారి చేత శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు ప్రమాణ స్వీకారం చేయించారు. ఉదయం పాలకొల్లు, తణుకు నుంచి భారీ ఊరేగింపుగా కార్యకర్తలు, నేతలు తరలివెళ్లారు. ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్, గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, కోరాడ శ్రీనివాస్, జోగి వెంకటేశ్వరరావు, మైఖేల్ రాజు, జోగాడ ఉమామహేశ్వరరావు వెలగపూడి తరలివెళ్లారు. అయితే ప్రమాణ స్వీకారం వద్దకు కేవలం ముఖ్య నేతలను మాత్రమే అనుమతివ్వడంతో పలువురు అసంతృప్తికి గురయ్యారు.

ఎంఎల్‌సిగా ప్రమాణ స్వీకారం చేసిన కవురు శ్రీనివాస్

ఎంఎల్‌సిగా ప్రమాణ స్వీకారం చేసిన వంక రవీంద్ర

బారులు తీరిన విద్యార్థినులు

ప్రశాంతంగా ఎపిఇఎపి సెట్

ప్రజాశక్తి - ఏలూరుఅర్బన్



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఎపి ఇఎపి సెట్ పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఈ నెల 23 వరకు జరిగే ఈ పరీక్షల్లో తొలి రోజైన సోమవారం ఇంజినీరింగ్ విద్యార్థులకు ఏలూరులోని మూడు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. వట్లూరులోని సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, సిద్ధార్థ క్వెస్ట్, ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలల్లో రెండు షిఫ్ట్‌ల్లో నిర్వహించిన ఈ పరీక్షకు మొత్తం 924 మందికి 897 మంది హాజరవ్వగా 27 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన మొదటి షిఫ్ట్‌లో సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో 180 మందికి 174 మంది హాజరవ్వగా ఆరుగురు గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 132 మందికి 128 మంది హాజరవ్వగా నలుగురు గైర్హాజరయ్యారు. సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 150 మందికి 146 మంది హాజరవ్వగా నలుగురు గైర్హాజరయ్యారు. మొత్తం ఉదయం షిఫ్ట్‌లో 462 మందికి 448 మంది హాజరవ్వగా 14 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఆరు గంటల వరకు జరిగిన రెండో షిఫ్ట్‌లో సిద్ధార్థ క్వెస్ట్‌లో 180 మందికి 175 మంది హాజరవ్వగా ఐదుగురు గైర్హాజరయ్యారు. ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 132 మందికి 125 మంది హాజరవ్వగా ఏడుగురు గైర్హాజరయ్యారు. సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో 150 మందికి 149 మంది హాజరవ్వగా ఒక్కరు గైర్హాజరయ్యారు. మొత్తం రెండో షిఫ్ట్‌లో 462 మందికి 449 మంది హాజరవ్వగా 13 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. ఉదయం ఏడు గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించారు. విద్యార్థులకు అవసరమైన తాగునీరు, తల్లిదండ్రులు విశ్రాంతి తీసుకునేందుకు గదులు ఏర్పాటు చేసినట్లు మూడు కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు ఎం.కృష్ణ, పి.బాలకృష్ణప్రసాద్, ఎ.శ్రీనివాసరావు తెలిపారు.



ఏలూరు మండలంలో మాట్లాడుతున్న కిషోర్

ముసునూరు మండలంలో మాట్లాడుతున్న రాజు

నూజివీడులో వినతి అందిస్తున్న నేతలు

ఉపాధి హామీ కూలీలకు కనీస వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - దెందులూరు రూరల్

ఉపాధి హామీ కూలీలకు కనీస అవసరాలైన తాగునీరు, మజ్జిగ, మెడికల్ కిట్లు, పనిముట్లు, టెంట్ పని ప్రదేశంలో ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రమైన దెందులూరులో అప్పారావు చెరువు వద్ద ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కొత్త ఫొటో సిస్టమ్ తీసుకొచ్చి రెండోపూట పని విధానం వల్ల ఉపాధి కూలీలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని మండిపడ్డారు. ఫొటోయాప్ సిస్టమ్ వల్ల నెట్ సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఫొటోలు పడక కూలీలు నానావస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ పేరుతో కొత్త నిబంధనలు తీసుకొచ్చిందన్నారు. గతంలో 20 మందికి ఒక మేట్ (మేస్త్రీ) ఉండేవారని, ఆ మేట్‌కు ఒక్కో ఉపాధి కూలీచేత పని చేయించినందుకు రూ.ఐదు వేతనం ఇచ్చేవారని తెలిపారు. ఇప్పుడు మేట్ల వ్యవస్థను రద్దు చేశారని, 20 మంది గ్రూపును 50 మందికిపైగా ఉండేలా కొత్త గ్రూపులు తయారు చేశారని, వీటికి సైట్ సూపర్‌వైజర్లను నియమిస్తున్నట్లుగా కేంద్ర ప్రభుత్వం తెలిపిందని వివరించారు. అయితే సంవత్సర కాలం గడిచినప్పటికీ ఇప్పటి వరకూ సైట్ సూపర్‌వైజర్లకు వేతనాలకు సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వం నిర్ణయించలేదని మండిపడ్డారు. ఫలితంగా ఎండాకాలంలో వందలాది మంది ఉపాధి కూలీలు పని చేస్తుంటే, వాళ్లందరి చేత పని చేయించడం, మస్తర్లు తీయించడం ఫీల్డ్ అసిస్టెంట్లకు కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశంలో కూలీలకు, మేట్లకు కనీస అవసరాలైన తాగునీరు, మజ్జిగ, పనిముట్లు, మెడికల్ కిట్స్, టెంట్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ విధివిధానాలను ఢిల్లీ నుంచి నిర్ణయించే బదులు ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం విధివిధానాలు నిర్ణయించుకునేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మన రాష్ట్రంలో పాత పద్ధతిలోనే ఉపాధి హామీ పనులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పి.కిషోర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

పనుల సందర్శనలో నేతలు

ఏలూరు: ఉపాధి హామీ పనుల్లో సైట్ సూపర్‌వైజర్లను నియమించాలని, వారికి ఒక్కొక్క ఉపాధి కూలీకి రూ.ఐదు చొప్పున వేతనాలు చెల్లించాలని సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకోవడానికి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పాలగూడెంలోని ఉపాధి కూలీల పనిప్రదేశాల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పని ప్రదేశం, గ్రామాల్లోని వ్యవసాయ, ఉపాధి కూలీలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ పేరుతో కొత్త నిబంధనలు తీసుకొచ్చిందన్నారు. మన రాష్ట్రంలో పాత పద్ధతిలోనే ఉపాధి హామీ పనులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జె.గోపీ పాల్గొన్నారు.

ముసునూరు: వేసవిలో ఉపాధి హామీ కూలీలకు కనీస సౌకర్యాలు అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ముసునూరు, చింతలవల్లి శివారు గోగులంపాడు, కొర్లకుంట, చెక్కపల్లి గ్రామాల్లో కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు అమలు చేయడం లేదని కూలీలు వాపోయారు. పనికి సంబంధించిన పలుగు, పార, తట్ట వంటి సామగ్రి ఇవ్వడం లేదని చెప్పారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా పని దినాలు 200 రోజులకు పెంచాలని, ప్రస్తుతమిచ్చే రూ.270 నుండి రూ.600కు పెంచాలని కోరారు. ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 17న నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాలో పెద్దసంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పిల్లి మురళీ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు కనీస వసతులు కల్పించాలని కోరుతూ సిపిఎం మండల కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ సబ్‌కలెక్టర్ కార్యాలయం అధికారులకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి హామీ పనులు కూలీలకు కడుపు నింపుతున్నాయన్నారు. అయితే వేసవి దృష్ట్యా విపరీతమైన ఉష్ణోగ్రతలు వడగాల్పులు వీస్తున్నందున ఉపాధి హామీ పని ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. మజ్జిగ, తాగునీరు అందించాలన్నారు. పని ప్రదేశాల్లో విషపు పురుగులు ప్రబలుతున్నందున స్థానిక ఆరోగ్య కార్యకర్త, ఆశా వర్కర్లను అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మరియదాసు పాల్గొన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలు అరికట్టాలని వినతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని తాడువాయి శివారు శ్రీ వీరభద్రస్వామి ఆలయ సమీపంలో ఎర్రకాల్వ జలాశయంలో అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టాలని ఆ గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో తాడువాయి ఎర్రకాలువ జలాశయంలో అక్రమ మట్టి తవ్వకాలు అరికట్టాలని కోరుతూ ఆర్‌డిఒ ఝాన్సీరాణికి వినతిపత్రం అందించారు. రాత్రీపగలు తేడా లేకుండా ఎర్రకాలువ జలాశయంలో అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతూ మట్టి రవాణా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాత్రి సమయంలో మట్టి రవాణా చేసే టిప్పర్లతో గ్రామస్తులకు నిద్ర పట్టడం లేదని వాపోయారు. జలాశయంలో మట్టి తవ్వకాలు జరపడం వల్ల లోతైన గోతులు ఏర్పడి, ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. మూడు నెలలుగా అక్రమ మట్టి రవాణాపై ప్రభుత్వాధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం సరికాదని తెలిపారు. ఇప్పటికైనా తాడువాయి గ్రామ శివారు శ్రీ వీరభద్రస్వామి ఆలయం దగ్గర ఉన్న ఎర్రకాలువ జలాశయంలో అక్రమ మట్టి తవ్వకాలు జరపకుండా చర్యలు చేపట్టాలని ఆ గ్రామస్తులు కోరారు. ఈ ఫిర్యాదు చేసిన వారిలో రాయల శ్రీనివాసరావు, పాలూరి గంగరాజు, తూటిగుంట లక్ష్మణరావు, మంగరాజు పాల్గొన్నారు.

నేడు జాతీయ డెంగీ నివారణ దినోత్సవం

ప్రజాశక్తి - ఏలూరుటౌన్

16న జరిగే జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని అన్ని ప్రాథమిక కేంద్రాల్లోనూ, అన్ని అర్బన్ ఆరోగ్య కేంద్రాల్లోనూ నిర్వహించాలని, దీనిలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొనాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.ఆశ ఆదేశించారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా మలేరియా అధికారి పిఎస్ఎస్.ప్రసాద్‌తో కలిసి డిఎంహెచ్ఒ ఆశ స్థానిక డిఎంహెచ్ఒ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ మాట్లాడుతూ గత రెండేళ్లలో డెంగీ కేసులు అధికంగా నమోదైన ప్రదేశాల్లో నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో చింతలపూడి, చాట్రాయి, పెదవేగి, పెదపాడు, భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల్లో, ఏలూరు పరిసర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో డెంగీ కేసులు నమోదవుతున్నాయన్నారు. ఆయా ప్రాంతాల్లో ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా మలేరియా అధికారి పిఎస్.ప్రసాద్ మాట్లాడుతూ డెంగీని వ్యాపింపజేసే ఈజిప్ట్ ఈడీస్ దోమ కాటు నుండి ప్రజలు రక్షించుకోవాలని కోరారు. ఈ దోమ గృహాలు, గృహ పరిసరాల్లో నీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయని, ఇంటి లోపల, ఇంటి బయట నీటి నిల్వ ప్రాంతాలైన తొట్టెలు, డ్రమ్ములు, ప్లాస్టిక్ పాత్రలు, రుబ్బురోళ్లు, పాత టైర్లు, కొబ్బరి బొండాలు, ఫ్లవర్ వాజులు, ఫ్రిడ్జ్ వెనుక బాక్స్ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, పి.శ్రీనివాసరావు, సబ్ యూనిట్ అధికారి బి.నాగేశ్వరరావు, బి.బసవరాజు, హెల్త్ అసిస్టెంట్స్ రమేష్, శ్రీనివాస్, వెంకటేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

యువగళం యాత్రకు అపూర్వ స్పందన

వంద రోజులైన సందర్భంగా సంఘీభావ యాత్ర

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

టిడిపి యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు అపూర్వ ప్రజాస్పందన లభిస్తోందని ఆ పార్టీ ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి చంటి అన్నారు. లోకేష్ యువగళం పాదయాత్ర చేపట్టి వంద రోజులు పూర్తయిన నేపథ్యంలో సోమవారం ఏలూరు నియోజకవర్గ టిడిపి ఆధ్వర్యంలో సంఘీభావ యాత్ర నిర్వహించారు. స్థానిక నూకాలమ్మ గుడి వద్ద నుండి ప్రారంభమైన ఈ యాత్రలో నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. యాత్ర చేపలతూము సెంటర్, పత్తేబాద, విజయవిహార్ సెంటర్ మీదుగా ఫైర్‌స్టేషన్ సెంటర్లోని ఎన్‌టిఆర్ విగ్రహం వరకు సాగింది. ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి ఇన్‌ఛార్జి బడేటి చంటి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం యువగళం యాత్రను అడ్డుకునేందుకు ఎన్ని కుట్రలు పన్నినా జనబలంతో, మొక్కవోని దీక్షతో నారా లోకేష్ ప్రజా సమస్యలను వింటూ, వారిలో ధైర్యాన్ని నింపుతూ ముందుకు సాగుతున్నారన్నారు. నియంతృత్వ పోకడలకు పోయే వారికి, అవినీతి పాలకులకు ఓటర్లు ఎటువంటి బుద్ధి చెబుతారో కర్నాటక ఎన్నికల తీర్పుతో మరోసారి వెల్లడైందని, ఈ తీర్పు జగన్మోహన్‌రెడ్డికి కనువిప్పు కల్గించాలన్నారు. ప్రజలను భయపెట్టి, ప్రతిపక్షాల గొంతు నొక్కి పరిపాలన సాగిద్దాం అనుకుంటే ప్రజలు తమ ఓటు హక్కు ద్వారా గద్దె దింపుతారని స్పష్టమైందని, త్వరలో జగన్మోహన్‌రెడ్డికీ ఇదే గతి పడుతుందని చంటి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 175 స్థానాలకు 175 స్థానాలు టిడిపి కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.



సంఘీభావ యాత్రలో నేతలు

మే పుష్పాల కనువిందు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెయ్యేరులో పోలవరపు శ్రీనివాసరావు ఇంటి పెరట్లో విరబూసిన మే పుష్పాలు కనువిందు చేస్తున్నాయి. మే నెలలో మాత్రమే వికసించే ఈ పుష్పాలు గ్రామస్తులను విశేషంగా అకట్టుకుంటున్నాయి. ఈ పుష్పాలను చూసేందుకు మహిళలు, పిల్లలు ఆసక్తి చూపుతున్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు జంక్షన్ వంటి కీలక ప్రాంతంలో రూపక దేవాలయం ఆవరణ కేంద్రంగా స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ ఆధ్వర్యంలో తాగునీరు, మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తహశీల్దార్ ఎస్‌కె.షంషుద్దీన్ తెలిపారు. చలివేంద్రాన్ని తహశీల్దార్ సోమవారం ప్రారంభించారు. మానవత సంస్థ జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు మానవత డైరెక్టరీని తహశీల్దార్‌కు అందజేశారు. డైరెక్టరీ ప్రాముఖ్యత గురించి తహశీల్దార్‌కు వివరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మూడు మండలాలకు చెందిన పలు గ్రామాలకు చెందిన ప్రజలు, భీమడోలు మీదుగా దూరప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులతోపాటు ప్రఖ్యాత ప్రసిద్ధ క్షేత్రం ద్వారకాతిరుమల దేవస్థానానికి వెళ్లే యాత్రికులకు మానవత ఏర్పాటు చేసిన చలివేంద్రం వల్ల ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. చలివేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా మజ్జిగను వితరణ చేసిన మానవత జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు గోనుగుంట రమణశంకర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మానవత సంస్థ జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు మాట్లాడుతూ చలివేంద్రం ద్వారా ప్రతి శనివారం భీమడోలు బస్టాండ్ మీదుగా ద్వారకాతిరుమల వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం నేరుగా మజ్జిగను బస్సుల వద్దే అందజేసే ఏర్పాట్లను చేశామన్నారు. దాతల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమానికి భీమడోలు జంక్షన్‌లోని బృందావన హోటల్ యజమాని సలాది వీరబాబు సహకరిస్తున్నారని తెలిపారు. ఇదేవిధంగా వేసవి వెళ్లే వరకు ప్రతి శనివారం ఈ కార్యక్రమాన్ని కొనసాగించేందుకు పలువురు దాతలు ఆసక్తి కనబరుస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో మానవత శాంతిరథాల విభాగం జిల్లా ఛైర్మన్ అప్పక రాంబాబు, భీమడోలు శాఖ ఛైర్మన్ గుళ్ల నూకరాజు, పంచకర్ల సత్యనారాయణ, ఈతకోట సత్యనారాయణ, చిలపర్తి రామారాయుడు పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహశీల్దార్

జాతీయ లోక్ అదాలత్‌లో 6565 కేసులు రాజీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 13వ తేదీన నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 6565 కేసులు పరిష్కరించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 32 బెంచీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏలూరులో ఆరు, భీమవరంలో ఐదు, కొవ్వూరులో నాలుగు, నరసాపురంలో మూడు, తణుకులో మూడు, తాడేపల్లిగూడెంలో మూడు, పాలకొల్లులో ఒకటి, నిడదవోలులో రెండు, జంగారెడ్డిగూడెంలో ఒకటి, చింతలపూడిలో రెండు, భీమడోలులో ఒకటి చొప్పున బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి తోడ్పడినవారందరికీ పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి జి.రాజేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు.

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని బర్రింకలపాడు ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల కళాశాలలో 2023-24 మొదట సంవత్సరానికి ఎంపిసి(40), బైపిసి (40), హెచ్ఇసి(40), సిఇసి(40) గ్రూపుల్లో మొత్తం 160 సీట్లకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి గిరిజన, గిరిజనేతర విద్యార్థుల నుంచి ధరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ జివి.రామానాయుడు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 31వ తేదీ వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో స్వీకరించనున్నట్లు తెలిపారు.

క్లెయిములను పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పున:నిర్మించి మూడున్నరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 32 వేల క్లెయిములను పరిష్కరించాలని ఎఐటియుసి ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏలూరు కలెక్టరేట్ వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డుకు సంబంధించిన రూ.1,150 కోట్లను బోర్డుకు జమ చేసి అపరిష్కృత క్లెయిములను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఎపి బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు చేపల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు, రెడ్డి శ్రీనివాస్ డాంగే, కంకిపాటి బుచ్చిబాబు, తొర్లపాటి బాబు, అప్పలరాజు, భవనిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు బొడెం వెంకట్రావు, పి.నారాయణమూర్తి, లింగాల శ్రీనివాస్, సిహెచ్.దుర్గారావు, ప్రతాప్, పొన్నాడ కిరణ్, బాజల్, పి.అరుణ్‌కుమార్, కుమార్‌రాజా, నాగరాజు పాల్గొన్నారు.

పలుచోట్ల 'గడప గడపకూ..'

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని శ్రీనివాసపురంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ ఎలిజా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి, శ్రీనివాసపురంలో జరిగిన అభివృద్ధి గురించి వివరిస్తున్నారు. ఈ క్రమంలో స్థానికులు మాట్లాడుతూ తమ ప్రాంతంలో అభివృద్ధి ఎక్కడ జరిగిందని గ్రామానికి చెందిన తడికల మోహన్ అనే వ్యక్తి ఎంఎల్ఎ ఎలిజాను నిలదీశారు. దీనిపై ఎంఎల్ఎ ఎలిజా స్పందిస్తూ అభివృద్ధి ఎక్కడ, ఎంత జరిగిందో తెలియాలంటే సచివాలయానికి వెళ్లి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం ఎంఎల్ఎ ఎలిజా ముందుకు వెళ్లిపోయారు. స్థానిక వైసిపి నాయకులు, కార్యకర్తలు, పోలీసులు వివాదాస్పదం కాకుండా సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు బాబ్జి, సచివాలయ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం: మండలంలోని లక్ష్మణుడుగూడెం సచివాలయ పరిధి కృష్ణాపురం గ్రామంలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, సర్పంచి మడకం రామలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు సుజాత, వైస్ సర్పంచి రేపాకాల చంద్రం, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

ప్రజాశక్తి - మండవల్లి

వేసవిలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న కూలీలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుని పని కల్పించాలని సర్పంచి మెండ రూనీస్ తెలిపారు. మండవల్లిలో చేస్తున్న ఉపాధి పనులను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఉపాధి పనుల ద్వారా కూలీలు లబ్ది పొందేలా ఎప్పటికప్పుడు సకాలంలో పనులు చూపించాలన్నారు. అంతేకాకుండా చేసిన పనులకు సకాలంలో సొమ్ము అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, కూలీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి జెడ్‌పి హైస్కూల్లో పదో తరగతిలో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.ప్రభుదాస్ చెప్పారు. ఈ మేరకు సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పదోతరగతి పరీక్ష ఫలితాల్లో తమ స్కూల్ విద్యార్థులు 133 మంది పరీక్షలు రాయగా, వారిలో 56 మంది ఉత్తీర్ణులు కాగా, 67 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారని చెప్పారు. పరీక్షల్లో తప్పిన విద్యార్థులందరికీ వారం రోజులుగా పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. జూన్ రెండో తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నందున విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈసారి జరిగే పరీక్షల్లో తమ పాఠశాల నూరు శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు తగినట్లుగా ఉపాధ్యాయులు ప్రణాళికలు సిద్ధం చేసి బోధిస్తున్నట్లు చెప్పారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 11 గంటల వరకు ఒక బ్యాచ్, 11 గంటల నుంచి ఒంటి గంట వరకు రెండో బ్యాచ్ రెండు విడతలుగా నాలుగు గంటల పాటు సబ్జెక్టు వారీగా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా ప్రజలకు అందించేందుకు కొన్ని అవాంతరాలు తప్పవని, అందుకు ప్రజలందరూ సహకరించాలని ఎపి ఈపిడిసిఎల్ ఇఇ కృష్ణానాయక్ చెప్పారు. నూజివీడులో ఆయన సోమవారం మాట్లాడుతూ ఎల్‌టి లైన్ మరమ్మతులు నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసమేనని ప్రజలు గుర్తించాలన్నారు. మరమ్మతుల సమయంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

ఎల్ఎన్‌డి పేటలో తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - పోలవరం

మండలం ఎల్ఎన్‌డి పేట గ్రామంలో సోమవారం ప్రమాదవశాస్తూ సంభవించిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. పోలవరం తహశీల్దార్ బి.సుమతి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఎల్ఎన్‌డిపేట గ్రామానికి చెందిన జక్కు ఏసమ్మకు చెందిన తాటాకిల్లు సోమవారం ప్రమాదవశాత్తూ దగ్ధమైంది. చెలరేగిన మంటలను స్థానికులు అదుపు చేయడంతో కొంతమేర ప్రమాద స్థాయి తగ్గిందని తెలిపారు. ఈ అగ్ని ప్రమాదంలో గృహోపకరణాలు పూర్తిస్థాయిలో దగ్ధమై బాధిత కుటుంబీకులు కట్టు బట్టలతో బయటపడి ప్రాణాలతో మిగిలారని తహశీల్దార్ తెలిపారు. రెవెన్యూ శాఖ తరపున దగ్ధమైన ఇంటిని పరిశీలించి బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసరాలు, కొంత నగదు సహాయంగా అందించినట్లు చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, సివిల్ సప్లై డిటి ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ కాజా రమేష్, విఆర్ఒ సాయి పాల్గొన్నారు.

బాధితులకు టిడిపి సాయం

బాధిత కుటుంబానికి టిడిపి నాయకులు సాయం అందించారు. టిడిపి మండల అధ్యక్షుడు బొడ్డు కృష్ణ ఆధ్వర్యంలో ఆ పార్టీ మండల నాయకులు దగ్ధమైన ఇంటిని పరిశీలించి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.25 కేజీల బియ్యం, గృహోపకరణాలు, నిత్యావసరాలు, నగదు అందించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

బస్టాండ్ గేటుకు అడ్డుగా బొండు ఇసుక అన్‌లోడ్

టిప్పర్ డ్రైవర్ నిర్వాకం
ప్రయాణికులు, వాహనదారుల ఇబ్బందులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మట్టిమాఫియా ఆగడాలు నానాటికీ పెట్రేగిపోతున్నాయి. మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి, బొండు ఇసుక టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముకుంటూ మట్టి మాఫియా రూ.లక్షల్లో సొమ్ము చేసుకుని జేబులు నింపుకుంటున్నారు. దీనికి తోడు కొందరు టిప్పర్ డ్రైవర్లు కూడా తామేమీ తక్కువ కాదంటూ ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తించడమే కాకుండా దారికి అడ్డంగా బొండు దిగుమతి చేసి ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బంది కలుగ జేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం ముదినేపల్లి బస్టాండ్ ముఖద్వారం ముందు ఓ టిప్పర్ డ్రైవర్ బొండు ఇసుక దిగుమతి చేశాడు. దీంతో ప్రయాణికులు లోపలికి, బయటకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. బస్టాండ్ ముఖద్వారం లోపల పార్కు చేసిన వాహనాలు బయటకు తీసేందుకు అవకాశం లేదు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు మార్గంలో అడ్డంగా బొండు ఇసుక ఎందుకు పోశావంటూ టిప్పర్ డ్రైవర్‌ను ప్రశ్నించారు. దీంతో రెచ్చిపోయిన డ్రైవర్ 'నా ఇష్టం నేను దిగుమతి చేస్తాను. మీకు చేతనైంది చేసుకోండి నా వెనుక మాఫియా ఉంది' అంటూ ప్రయాణికులపై, వాహనదారులపై చిందులేసి అక్కడ నుంచి జారుకున్నాడు. ఈ విషయం మండల రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆర్ఐ శివకుమార్ ఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తోలకాలు చేయడమే కాకుండా ప్రశ్నించిన వారిపై ఇష్టారాజ్యంగా మాట్లాడిన టిప్పర్ డ్రైవర్‌పై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ముఖద్వారం లో బొండు ఇసుక దిగుమతి చేయడంతో బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు చుట్టూ తిరిగి బస్టాండ్‌లోని ప్లాట్‌ఫారంలకు వెళ్లాల్సి వస్తోంది.

బస్టాండ్ ముఖద్వారం ఎదుట బొండు ఇసుక

ఘనంగా సర్ ఆర్థర్ కాటన్ జయంతి


కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాధవరావు

ప్రజాశక్తి - భీమడోలు

గోదావరి డెల్టాను సస్యశ్యామలం చేసి ప్రజలు కరువు బారిన పడకుండా కృషి చేసిన సర్ అర్థర్ కాటన్ ధన్యజీవి అని జలవనరుల శాఖ గుండుగొలను సెక్షన్ సహాయ ఇంజినీర్ కె.మాధవరావు, భీమడోలు తహశీల్దార్ షంషుద్దీన్ తెలిపారు. గుండుగొలను, భీమడోలులోని వారి కార్యాలయాల్లో సోమవారం కాటన్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ ఇంజినీర్ మాధవరావు, తహశీల్దార్ కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పట్లో కాటన్ చేసిన కృషి ఫలితంగా జిల్లాకు సాగు, తాగునీరు ఇబ్బందులు లేకుండా అందుతున్నాయని తెలిపారు. ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ప్రతిఒక్కరి గుండెలో ఆయన చిరంజీవిగా నిలిచారన్నారు. జల వనరుల శాఖ సహాయ ఇంజినీర్ మాధవరావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, తమ శాఖ పరంగా ఏలూరు కాలువలో పూడిక తీత కార్యక్రమం పూర్తయిందన్నారు. ప్రస్తుత సంవత్సరం కాలువలో తూడు తొలగించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. దీనిలో భాగంగా పూళ్ల- కైకరం మధ్య ఉన్న మూడో నెంబర్ ఎస్కేప్ నుంచి ఏలూరులోని తూర్పులాకుల వరకు ఉన్న ఏలూరు కాలువలో తూడు తొలగింపు రూ.15 లక్షలు, ఆగడాలలంక ఛానల్‌తో పాటు, పలు ఇతర బ్రాంచి చానల్స్‌లో తూడు తొలగింపునకు రూ. తొమ్మిది లక్షలు మంజూరయ్యాయన్నారు. టెండర్ కార్యక్రమాలు పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో భీమడోలు ఎంపిడిఒ. డి.సత్యనారాయణ, వ్యవసాయ అధికారి ఉషారాణి, గుండుగొలను ఇరిగేషన్ కార్యాలయ సహాయకులు సత్యనారాయణ, బాబురావు పాల్గొన్నారు.

కలిదిండి : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గోదావరి డెల్టా పితామహుడు సర్ ఆర్థర్ కాటన్ జయంతి వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోదావరి నదిపై ధవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మాణంలో ఆయన చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. అనంతరం స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులు నిర్వహించినట్లు శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు తెలిపారు. ఉపాధ్యాయులు డివి.నరేష్, షేక్ మొహిద్దిన్ నాయక్ పాల్గొన్నారు.

నేడు ముదినేపల్లి మండల సమావేశం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 16వ తేదీ మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు మండల పరిషత్ సమావేశపు హాలులో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ పి.మల్లీశ్వరి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిపి రామిశెట్టి వీరవెంకటసత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, అన్ని శాఖల మండలస్థాయి ప్రభుత్వ అధికారులు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

ఆహ్లాదంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని పంగిడిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-2005 సంవత్సరం వరకు విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఆహ్లాదంగా జరిగింది. పంగిడిగూడెం అన్నపూర్ణ ఫంక్షన్‌హాలులో సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం సందర్భంగా పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న రోజుల్లో తమ గురువులను సత్కరించారు. తమ గత జ్ఞాపకాలతో సందడి చేశారు. పూర్వ విద్యార్థులంతా ఒక వేదికపై కలిసేందుకు కృషి చేసిన నున్నా పవన్‌కుమార్‌ను సహచర స్నేహితులు, ఉపాధ్యాయులు అభినందించారు.



పూర్వ విద్యార్థులు

గొల్లగూడెంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సత్యనారాయణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని గొల్లగూడెంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని నారాయణపురం సొసైటీ త్రిసభ్య కమిటీ డైరెక్టర్ దాసరి సత్యనారాయణ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న క్వింటాలకు రూ.1,962కు కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని గొల్లగూడెం పరిసర గ్రామాల మొక్కజొన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యుల కమిటీ ఛైర్మన్ పాపారావు బాబ్జి, రైతులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

ఇంటి డాక్యుమెంటు పడిపోయినది

ఉంగుటూరు మండలం, చేబ్రోలు గ్రామ పరిధిలో గల ఇంటి డాక్యుమెంటు నెం. 5488/2014, భీమడోలు (ఎస్.ఆర్.ఓ) ది.12-05-2023న చేబ్రోలు గేటు సమీపంలో పడిపోయినది. కావున దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

గొంతుమూర్తి నాగరాజు
చేబ్రోలు, ఉంగుటూరు మండలం,
ఏలూరు జిల్లా. సెల్: 95531 13116

నకిలీ మస్తర్లు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని నాగులగూడెం గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో నకిలీ మస్తర్లు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు నాగులగూడెం గ్రామంలో మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పనులకు వెళ్తున్న పలువురు గ్రామస్తులు సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆర్‌డిఒ ఝాన్సీరాణికి ఫిర్యాదు చేశారు. నాగులగూడెం గ్రామంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ గోలి ప్రణీత రెడ్డి గ్రామీణ ఉపాధి పనికి రాని ఆయన బంధువులకు ఉపాధి హామీ పనులకు వచ్చి నట్లు దొంగ మస్తర్లు వేస్తున్నారని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుని ఉపాధి పనికి రాకుండా డబ్బులు డ్రా చేసిన వారి వద్ద నుంచి సొమ్ము రికవరీ చేయాలని కోరారు. ఈ ఫిర్యాదు చేసిన వారిలో టేకు ముడి సింహాద్రి, బాలస్వామి, కూలీలు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, గణపవరం మండలం, గణపవరం గ్రామం కాపురస్తులు బాతు ప్రకాష్, తండ్రి: బాతు వీరాస్వామి అను నేను నా యొక్క పాస్‌పోర్టు గణపవరం సెంటర్లో జిరాక్స్ తీయించుకుని మళ్లీ ఇంటికి మోటార్ సైకిల్ పై వెళ్తుండగా పాస్‌పోర్టు ఉన్న కవరు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబర్ **H1762056** గల పాస్‌పోర్టు దొరికిన వారు ఈ క్రింది ఫోన్ నెంబర్ కు తెలియజేయవలసిందిగా కోరుచున్నాము.

బాతు ప్రకాష్
తండ్రి: బాతు వీరాస్వామి, గణపవరం,
గణపవరం మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.
సెల్: 99596 04859

బ్యాంకు మిత్ర సేవలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - మండవల్లి

ఎండ వేడిమితో ఇబ్బందులు పడకుండా గ్రామాల్లో ఏర్పాటు చేసిన బ్యాంకు మిత్ర సేవలను సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు స్పష్టం చేశారు. స్థానిక ఇండియన్ బ్యాంకులో ఆయన సోమవారం మాట్లాడారు. వేసవి కారణంగా ఎండలు మండుతున్నాయని ఉక్కపోత విపరీతంగా ఉందని చెప్పారు. బ్యాంకు సంబంధిత లావాదేవీల కోసం బ్యాంకు వద్దకు వచ్చి ఎంతోమంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలా ఇబ్బందులు పడకుండా ఉండేవిధంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన బ్యాంకు మిత్ర సేవా కేంద్రాలను వినియోగించుకుని ఎండవేడికి, వడదెబ్బకు గురికాకుండా ఉండాలని ఆయన సూచించారు. ఈ కేంద్రాలు ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల సెలవు రోజుల్లో కూడా నిర్విరామంగా పని చేస్తాయని తెలిపారు. బ్యాంకుకు సంబంధించిన లావాదేవీలన్నీ ఈ కేంద్రాల్లో జరుపుకోవచ్చన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్లలో ప్లే స్టోర్ నుంచి బ్యాంకు మొబైల్ అప్లికేషన్ ఇన్ ఒఎస్ఐఎస్‌ను డౌన్‌లోడ్ చేసుకుని దాని ద్వారా కూడా బ్యాంకులో పొందే అన్ని సేవలను కూడా ఇంటి వద్ద నుంచి పొందవచ్చని తెలిపారు.

దస్తావేజులు పోయినవి

నా పేరు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, తండ్రి: కనకరాజు, కొమ్ముచిక్కాల. ది. 31-01-2023వ తేదీన ఉదయం 10 గంటల సమయంలో నేను ఒక బ్యాగులో దస్తావేజు నెం.3907/2002 మరియు 3846/1987 దస్తావేజులు జిరాక్సు కొరకు కొమ్ముచిక్కాల నుండి కవిటం నా మోటారు సైకిలు మీద వెళుతుండగా కవిటం చేరుకునే సరికి రెండు దస్తావేజులు కలిగి ఉన్న బ్యాగు జారిపడిపోయినది. నేను చుట్ట ప్రక్కల అంతా వెతికినాను కాని దొరకలేదు. సదరు విషయము పోడూరు పోలీసు స్టేషను వారికి ఫిర్యాదు చేయగా నా కంప్లయింటు రిజిష్టరు చేసి సర్టిఫికెట్టు ఇచ్చినారు. ఒక వేళ నా దస్తావేజులు ఎవరికైనా దొరికితే ఈ క్రింది ఫోన్ నెంబరుకు తెలియపర్చ కోరుచున్నాను.

గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు
కొమ్ముచిక్కాల. సెల్: 94409 84963

యువగళానికి సంఘీభావంగా
టిడిపి నేతల పాదయాత్ర

కైకలూరులో....

ప్రజాశక్తి - ముదినేపల్లి

నారా లోకేష్ చేస్తున్న పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ ఆదేశాల మేరకు సంఘీబావ పాదయాత్ర ముదినేపల్లి మండలంలో సోమవారం నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ యువ నాయకులు కొడాలి వినోద్ ఆధ్వర్యంలో ముదినేపల్లి నుంచి సింగరాయపాలెం వరకు పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్రలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, యువత, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం లోకేష్ పాదయాత్ర విజయవంతం కావాలని, 2024లో చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలంటూ సింగరాయపాలెంలో శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పూజలు, ప్రార్థనలు చేయించారు. ఈ పాదయాత్రలో రెండు వేలమంది పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

చాట్రాయి : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబు చేపట్టిన యువగళం వంద రోజులు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆ పాదయాత్రకు మద్దతుగా ఏలూరు పార్లమెంట్ అధికారి ప్రతినిధి మందపాటి బసవరెడ్డి, విజయ మిల్క్ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, మాజీ ఎంపిపి కందుల కృష్ణ, పుచ్చకాయల నోబెల్‌రెడ్డి, కోట జోషి ఆధ్వర్యంలో సోమవారం పాదయాత్ర చేపట్టారు. టిడిపి మండల పార్టీ కార్యాలయం నుంచి రామాలయం వరకు పాదయాత్ర చేశారు. అనంతరం రామాలయంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల తెలుగు యువత అధ్యక్షులు బొంతు సతీష్, తుమ్మ గూడెం గ్రామ టిడిపి అధ్యక్షులు మందలపు రాజా, టిడిపి పర్వతాపురం గ్రామ అధ్యక్షులు బొర్రా నాగేశ్వరరావు, కాసాగాని గోవర్ధన్‌రెడ్డి, పలగాని లక్ష్మీనారా యణ, వంగల సుబ్బారావు, వెల్ది నాగేశ్వరరావు, చల్లగుళ్ల విజయశేఖర్, టిడిపి మండల కార్యదర్శి కంచర్ల హనుమంతరావు, వెంకటేశ్వరరావు, టిడిపి నేతలు పాల్గొన్నారు.

కైకలూరు : యువగళం పాదయాత్రకు సంఘీభావంగా పట్టణంలో టిడిపి నేతలు సోమవారం ర్యాలీ చేశారు. మండవల్లి మండలం చావలిపాడు నుంచి కైకలూరు మీదుగా ఆటపాక మాగంటి బాబు నివాసంలోని పార్టీ కార్యాలయం వరకు పాదయాత్ర చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చాట్రాయిలో...

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం అడిషనల్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో
S.T.C.No. 132/2022

బిట్వీన్:
బిక్కవోలు ప్రసాద్ రావు ...ఫిర్యాది
మరియు
కొండ్రెడ్డి మురళీకృష్ణ ...ముద్దాయి

ముద్దాయి:
కొండ్రెడ్డి మురళీకృష్ణ, తండ్రి: నరసారావు, వయస్సు 48, హిందూ, పురుషుడు, వ్యాపారం, డో.నెం.4-164-8/4, గణేశ్ నగర్, తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం టౌన్ పి.ఎస్., ప॥గో॥జిల్లా. సెల్: 98660 55885.

పై కేసులో ముద్దాయి అయిన మీరు పై చిరునామాలో ఉంటూ సమన్లు తీసుకొనక తప్పించుకు తిరుగుచున్నందువలన, ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా పై కేసులో మీ హాజరు కొరకు **ది.23-06-2023వ తేదీకి వాయిదా అయి ఉన్నది. సదరు తేదీ ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకోవలసినది.** లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

కొవ్వూరి అప్పిరెడ్డి
న్యాయవాది,
తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం.
12-5-23. సెల్: 94401 28616

మండవల్లి ఎంపిడిఒగా ఆనందబాబు

ప్రజాశక్తి - మండవల్లి

ఆనందబాబు

మండవల్లి మండలానికి నూతన ఎంపిడిఒగా ఆనందబాబు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా పని చేసిన పి.మల్లేశ్వరిని కలిదిండి మండలానికి ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా బదిలీ చేశారు. దీంతో ఇఒ పిఆర్‌డిగా విధులు నిర్వహిస్తున్న ఆనందబాబుకు ఎంపిడిఒగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం పని చేస్తూ మండవల్లి మండలాన్ని అభివృద్ధిలో ముందు ఉంచడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

'టిడిపి బలోపేతానికి కృషి'

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో టిడిపి బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలుగు రైతు రాష్ట్ర కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి వాసిరెడ్డి మోహన్‌రావు అన్నారు. టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీగా మోహన్ ఎంపికైన సందర్భంగా మండలంలోని బంధంచర్ల గ్రామంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపిలో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. తనపై నమ్మకంతో ఆర్గనైజింగ్ కార్యదర్శి పదవికి ఎంపిక చేసిన జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు పదవి రావడానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడుకు, పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులుకు, రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావుకు ధన్యవాదాలు తెలిపారు.

మహారాజశ్రీ తణుకు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు
O.S.No. 308/2018
I.A.No. /2018

బిట్వీన్:
పెనుమర్తి అనుసూయ ...వాది
మరియు
తుట్టగుంట శ్రీరామచంద్ర మూర్తి మరియు 16 మంది ఇతరులు ...ప్రతివాదులు

డి-16: రెడ్డి వెంకట సత్యనారాయణ, తండ్రి: పల్లయ్య, డో.నెం. 9-21, వీరభద్రపురం, తణుకు.

పై నెంబరు దావాలో మీకు ఎన్ని పర్యాయములు దావా సమను మరియు Injunction I.A.లో నోటీసులు కోర్టు నుండి పంపిననూ ఉద్దేశ్యపూర్వకంగా మీరు తీసుకోకుండా తప్పించుకొనుచున్నందున పై నెంబరు దావాలో సమను మరియు ఐ.ఎ.లో నోటీసు మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా జారీ చేయుచున్నారు. **కాబట్టి మీరు ది.14-06-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి మీ వాదన తెలియపర్చనిచో సదరు దావా మరియు పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.**

ఎం.బాలాజీరావు
తణుకు, వాది తరుపు అడ్వకేట్, తణుకు.
01-5-23. సెల్: 94406 14905

In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku
O.S.No. 576/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Tanuku ...Plaintiff
VS
Vemula Venkata Lakshmi another ...Defendants

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) వేముల వెంకటలక్ష్మి, భర్త: వర్ధనరావు, హిందువు, స్త్రీ, 37 సం॥లు, వ్యవసాయం, డో.నెం. 10-64/1, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2) వేముల వర్ధనరావు, తండ్రి: చిరంజీవి, హిందువు, పురుషుడు, 41 సం॥లు, వ్యవసాయం, డో.నెం. 10-64/1, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.18-05-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

N.RAVI SHANKAR
Advocate, Tanuku.

మహారాజశ్రీ స్పెషల్ మేజిస్ట్రేట్ వారి కోర్టులో :: తణుకు
C.C.No. 1/2019

బిట్వీన్:
ఫిర్యాది: శ్రీనివాస రైస్ & జనరల్ స్టోర్స్, ప్రొ॥ నడింపల్లి వీరవెంకట సూర్య నాగ సతీష్.
మరియు
ముద్దాయి: కాటూరి వీరరాఘవులు

ముద్దాయి హాజరు నిమిత్తం సెక్షన్ 82 of CRP ప్రకారం నోటీసు

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా పై నెంబరు కేసు నందు ముద్దాయి కాటూరి వీరరాఘవులు, తండ్రి: రామకృష్ణ, ప్లాటు నెం. 505, ఎస్.ఆర్.ఎస్.ప్లాజా, భారతిదేవి ఆసుపత్రి దగ్గర, ఆర్.పి.రోడ్డు, తణుకు, పశ్చిమగోదావరి జిల్లా వారికి మీరు జారీ చేసిన చెక్కు చెల్లనందున ఫిర్యాది మీపై క్రిమినల్ కేసు దాఖలు చేసియున్నారు. సదరు కేసు నందు మీరు హాజరు కానందున శ్రీ కోర్టు వారు మీపై ఎన్.బి.డబ్ల్యు జారీ చేసియున్నారు. సదరు ఎన్.బి.డబ్ల్యు అమలు జరుపుటకు మీరు పరారిలో ఉన్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులపై **తేదీ 01-06-2023 సం॥రం తేదీన పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ తాలూకు ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను,** లేనిచో మీ పరోక్షమందు తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

జి.శ్రీనివాసకుమార్
తణుకు, ఫిర్యాది తరుపు అడ్వకేట్, తణుకు.
10-5-23. సెల్: 94401 33719